

దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అంకుశాపూర్‌లో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీకళాశాల (మహేంద్రహిల్స్)లో న్యూట్రిషన్ సబ్జెక్టు బోధించడానికి అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్నేహలత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూట్రిషన్ సబ్జెక్ట్‌లో పీజీ పూర్తిచేసి నెట్/సెట్ అర్హత కలిగిన అభ్యర్థులు జనవరి 3లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 6వ తేదీన ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.



అమ్మవారికి ఒడిబియ్యం నింపుతున్న మహిళలు

వైభవంగా ధనుర్మాస వ్రతాలు, పూజలు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం గోదా అమ్మవారికి ఎంతో ప్రీతికరం కావడంతో భక్తులు అమ్మవారి వ్రతాన్ని ఆచరిస్తున్నారు. ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి ఆలయానికి తెల్లవారుజామునే భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. నెల రోజుల పాటు ఆలయ వేదపండితులు అమ్మవారి తిరుప్పావై పాశురాలను చదివి భక్తులకు వినిపిస్తుంటారు. శనివారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు.కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాజగోపాలాచార్యులు, పురుషోత్తమా చార్యులు, అనంత సేనామాచార్యులు, పవనాచార్యులు, శ్రీపతీచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబర్ 28(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు ఫిబ్రవరి 1వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. 2025 -26 సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు రూ.100 చెల్లించాలని తెలిపారు. మీ సేవలో దరఖాస్తు చేసుకునేందుకు సాధ్యం కాకుంటే స్థానికంగా ఉండే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు కులం, ఆదాయం, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ నెంబర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని తెలిపారు.



ట్రాలీ వ్యాన్ బోల్తా పడడంతో రోడ్డుపై పడిపోయిన మద్యం సీసాలు(ఫైల్)



శామీర్‌పేట్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న తల్లీబిడ్డ (ఫైల్)

క్రైం రన్!

ఈ ఏడాది భారీగా పెరిగిన నేరాలు

రౌండప్ 2024 ఆత్మావలోకనం roundup

- రోడ్డు ప్రమాదాలు.. దొంగతనాలు అధికం
- వికారాబాద్‌లో తగ్గిన మృతుల సంఖ్య
- మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువే
- తగ్గిన దోపిడీ కేసులు
- పెరిగిన హత్యాయత్నాలు
- శామీర్‌పేట పెద్ద చెరువులో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య
- కొత్తూరు చెరువులో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు దుర్మరణం

వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో నేరాల వివరాలు

నేరం	వికారాబాద్ జిల్లా		మేడ్చల్ జిల్లా
	2023	2024	2024
హత్యలు	29	22	16
అత్యాచారాలు	55	64	43
హత్యాయత్నాలు	33	32	....
దోపిడీలు	03	02	10
కిడ్నాప్‌లు	60	67	45
మోసం	127	244	.....
దొంగతనాలు	195	263	338
ఆత్మహత్యలు	222	158	111
కిడ్నాప్‌లు	53	63	45
రోడ్డు ప్రమాదాలు	326	327	511
మృతులు	189	148	310
ఇతర కేసులు	715	791	1,425
మొత్తం కేసులు	1,970	2,301	3,209

ఈ యేడాది వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో నేరాల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజురోజుకూ ఘోరాలు కూడా భారీగా పెరిగిపోతున్నాయి. ప్రధాన రహదారులతో పాటు చిన్నపాటి రోడ్లు రక్తం మరిగాయి. రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మేడ్చల్ జిల్లా కొల్తూరు చెరువులో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు మరణించడంతో ఆ కుటుంబాల్లో విషాదం నింపింది. ఆ చిన్నారుల మరణంతో వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. శామీర్‌పేట పెద్ద చెరువులో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. జిల్లా పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో డ్రగ్స్, గంజాయి అమ్మకాలు, వాడకం కూడా బాగా పెరిగింది. ప్రమాదాల నివారణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా పెద్దగా ఫలితం ఉండడం లేదు.

వికారాబాద్/మేడ్చల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత ఏడాదితో పోలిస్తే వికారాబాద్ మేడ్చల్ జిల్లాల్లో నేరాల సంఖ్య గణనీయంగా పెరిగింది. వికారాబాద్ జిల్లాలో 2023లో మొత్తం 1,970 కేసులు నమోదైతే, 2024లో డిసెంబరు 25వ తేదీ వరకు 2,301 కేసులు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో 331 కేసులు పెరిగాయి. జిల్లాలో ప్రధానంగా హత్యలు, హత్యాయత్నాలు తగ్గగా, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, ఆత్మహత్యకు ప్రేరేపించే సంఘటనలు పెరిగాయి. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు కూడా పెరిగాయి. కాగా, గత ఏడాదితో పోలిస్తే దోపిడీ సంఘటనలు తగ్గాయి. రోడ్డు ప్రమాదాల కేసులు గత ఏడాది 326 నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 327 కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో వాహనదారులు మృత్యువాత పడిన కేసులు గత ఏడాది 189 ఉండగా, ఈసారి 154 కేసులకు తగ్గాయి. రోడ్డు ప్రమాదాల్లో గత ఏడాది 189 మంది మృతి చెందగా, ఈసారి 148 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉంటే, మహిళలపై జరిగే అఘాయిత్యాల కేసులు పెరిగాయి. జిల్లా పోలీసు యంత్రాంగానికి సవాల్‌గా మారిన కేసులను ఛేదించడంలో సీసీఎస్ పోలీసులు ముఖ్య భూమిక పోషించారు. ఇంతకు ముందు పనిచేసిన ఎస్పీ కోటిరెడ్డి, ప్రస్తుత ఎస్పీ నారాయణరెడ్డిల నేతృత్వంలో షికార్ గ్యాంగ్‌తో పాటు చైన్ స్నాచింగ్, మణప్పురం మేనేజర్ కుచ్చుటోపీ వంటి కీలకమైన కేసులను చాకచక్యంగా ఛేదించగలిగారు.

షికార్ గ్యాంగ్ అరెస్టు...

తండ్రీ, కొడుకు, కూతురు భర్త కలిసి ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడేవారు. ఈ ముగ్గురిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో చేసిన దొంగతనాలపై 150 కేసులు నమోదయ్యాయి. జిల్లాలో ఇళ్లల్లో జరిగిన దొంగతనాలపై విచారణ జరిపిన సీసీఎస్ పోలీసులు షికార్ గ్యాంగ్‌గా గుర్తించారు. ఇతర రాష్ట్రాల పోలీసులకు కూడా సవాల్‌గా మారిన షికార్ గ్యాంగ్‌ను సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంతయ్య బృందం

- మిగతా 8వ పేజీలో..

మేడి చెలిమ నుంచి మేడ్చల్‌గా..

- నామకరణం చేసిన బాటసారులు
- చెరువు అంచుల్లోని మేడి చెట్టుకింద వ్యాపారుల బస



మేడ్చల్ పట్టణం వ్యూ

Sunday Special

మేడ్చల్ టౌన్, డిసెంబరు 28: ఒకప్పుడు మేడ్చల్ ప్రాంతానికి ప్రత్యేకంగా పేరంటూ ఉండేది కాదు. ఈ ప్రాంతం గుండా వెళ్లే బాటసారులు సేద తీర్చుకోవడానికి స్థానిక చెరువు అంచుల్లో ఉన్న పెద్ద మేడి చెట్టు దగ్గర సేద తీరేవారు. ఆ బాటసారులు అక్కడ దాహం తీర్చుకోవడానికి ఓ నీటి చెలిమ(గుంత)ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మేడి చెట్టులోని మేడి, చెలిమిని కలిపి ఆ ప్రాంతాన్ని మేడి చెలిమిగా పిలిచేవారు. అలా కాలక్రమేణా అది మేడ్చల్‌గా మారింది. స్థానికంగా నాలుగు వందల సంవత్సరాల చరిత్రను చాటే చిహ్నాలు ఉన్నప్పటికీ అంతకు పూర్వం ఈ ప్రాంత చరిత్రను చాటే సత్తా పెద్ద చెరువుకు దక్కుతుందని స్థానికులు అంటున్నారు. మేడ్చల్ అనే పేరు ఎలా వచ్చిందన్న విషయం పట్ల భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ స్థానికులు మాత్రం ఈ పేరు మేడి చెలిమి నుంచి పుట్టిందని గట్టిగా నమ్ముతున్నారు.

వలస వచ్చినవారికి లక్కీస్పాట్

కుగ్రామంగా ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం పట్టణంగా మారింది. పట్టణాన్ని తలపించే విధంగా ఉన్న మేడ్చల్ పూర్వం బాటసారులకు, ప్రస్తుతం పొట్ట చేతపట్టుకొని జీవనోపాధి కోసం వచ్చిన వారికి లక్కీస్పాట్‌గా మారింది. దీంతో ఈ ప్రాంతంలో శాశ్వతంగా స్థిరపడ్డ వతన్ దార్ల కన్న కడుపును నమ్ముకొని వచ్చిన వారికే

- మిగతా 6వ పేజీలో..



మేడ్చల్ రైల్వే స్టేషన్

రైళ్లలో గంజాయి, గోవా మద్యం పట్టివేత

- తాండూరులో 12 కిలోల గంజాయి, వికారాబాద్‌లో 95 బాటిళ్ల గోవా మద్యం పట్టివేత
- వివరాలు వెల్లడించిన వికారాబాద్ ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి



6

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

- బయటకు పరుగులు తీసిన విద్యార్థులు
- హస్నాబాద్ పాఠశాలలో ఘటన
- శిథిలావస్థకు చేరిన పాఠశాల
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన



7

పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు

- బడీడు పిల్లలు బడిలో ఉండాలి
- వారికోసం ప్రత్యేక బడులు ఏర్పాటు చేసేందుకు కృషి
- పరిగిలో ఇటుక బట్టీలను తనిఖీ చేసిన సీఐ
- కూలీలకు అవగాహన కల్పిస్తామని వెల్లడి



7



గిరిగేట్‌పల్లిలో ప్రభుత్వ భూమిలో కనుమరుగవుతున్న ఎర్రమట్టి కొండలు

కొండను పిండేస్తున్నారు!

అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు

- యథేచ్ఛగా అక్రమార్కుల ఆగడాలు
- గిరిగేట్‌పల్లిలో కనుమరుగైన పెద్దగుట్ట
- చుట్టుపక్క గ్రామాల్లోనూ ఇదే తంతు
- వ్యాపారం మొత్తం చీకటి దందానే
- జేసీబీ, టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

కొందరు అక్రమార్కులు అక్రమ వ్యాపారానికి ఏదీ అడ్డం కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గిరిగేట్‌పల్లి, సమీప గ్రామాల్లోని అసైన్డ్ భూముల్లో ఎర్రమట్టి తవ్వకాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. చీకటిపడితే చాలు ఎర్రమట్టి కొండలను పిండి చేస్తున్నారు. అధికారులు.. రాజకీయ నాయకులు దీని గురించి పట్టించుకోకపోవడంతో ఈ అక్రమార్కుల వ్యాపారం మూడు పూలు.. ఆరు కాయలుగా మారింది. ఈ అక్రమార్కులకు అధికారులు. రాజకీయ నాయకుల అండదండలు కూడా ఉన్నాయన్న గుసగుసలు స్థానికంగా వినిపిస్తోంది.

- వివరాలు 7లో

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కేశంపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని సీనియర్ నాయకుడు అబ్బి సుందరయ్య అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేని ప్రారంభించారు. యాప్‌లో దరఖాస్తు దారుల వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, నాయకులు చేవెళ్ల నర్సింహులు, తాండ్ర కృష్ణారెడ్డి, ప్రభాకర్‌జీ, అవంచ బాలరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మేడి చెలిమ నుంచి మేడ్చల్‌గా..

(5వ పేజీ తరువాయి)

అన్ని విధాలుగా అచ్చుబడి వస్తుందని స్థానికులు అనడం గమనార్హం. నాలుగు తరాలుగా ఇక్కడ ఉన్న వారు ఈ ప్రాంతం విశిష్టత గురించి తమ రాబోయే తరాలకు చెప్పే ముందు మేడి చెలిమితో కథ ప్రారంభించి మేడ్చల్ అంటూ ముగించటం పరిపాటి. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన నానమ్మలు తమ ఇంట్లో పిల్లలకు ఊరు పుట్టుక గురించి కథలు చేపట్టం విశేషంగా మారింది.

పేరుకు పునాదులు ఇలా..

హైదరాబాద్ సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్న గోల్కొండ ఖుతుబ్ షాహి రాజుల కాలంలో వ్యాపారం నిమితం ఉత్తర భారత దేశం నలుమూలల నుంచి వ్యాపారం చేయడానికి హైదరాబాద్ వచ్చే వ్యాపారస్తులు (కారోబార్‌లు) మేడ్చల్ ప్రాంతంలో విశ్రాంతి తీసుకునేవారు. ఈ మార్గం మేడ్చల్ పెద్ద చెరువుకు అనుకుని ఉండటంతో ఎడ్ల బండ్లలో వచ్చే వారు తమ బండ్లను చెరువు అంచుల్లో ఉన్న పెద్ద మేడి వృక్షం కింద ఆపి సేద తీర్చుకునే వారు. ఆ సమయంలో బాటసారులు తమ దాహం తీర్చుకోవడానికి మేడి చెట్టు సమీపంలోని చెరువు అంచుల్లో చెలిమలు తవ్వి కావాల్సిన మంచినీటిని సమకూర్చుకునేవారు. సేద తీర్చు కోవటానికి మేడి వృక్షం... దాహం తీర్చు కోవటానికి చెలిమి ఉండటంతో ఈ ప్రాంతంలోనే బాటసారులు సేద తీరేవారు. దీంతో ఈ ప్రాంతం విశ్రాంతి స్థావరంగా మారింది. హైదరాబాద్ వెళ్లి పని ముగించుకుని తిరుగు ప్రయాణం చేసేవారు తమ మార్గాన్ని సులువుగా గుర్తించడానికి మేడి చెట్టు చెలిమి అంటూ సంబోధించుకునే వారు. అనంతరం మేడి చెలిమి అంటూ సంబోధిస్తూ ఈ ప్రాంతానికి బాటసారులు తెలియకుండానే నామకరణం చేశారు. అనంతరం చెరువు అంచుల్లో నివాసాలు ఏర్పడి ఓ చిన్నపటి గ్రామం ఏర్పడింది. అప్పటి నుంచి ఇక్కడ జనజీవనం ప్రారంభమై అనంతరం కాలక్రమేపి చెరువు అంచుల్లో ఉన్న ఎడ్ల బండ్ల బాట.. చెరువు కట్టలా మారింది. అనంతరం రహదారుల అభివృద్ధిలో భాగంగా కట్ట పై నుంచి జాతీయ రహదారి నిర్మించి హైదరాబాద్ నుంచి దక్షిణ భారత దేశానికి రాక పోకలను సులువు చేశారు. దీంతో ఈ ప్రాంతం మెల్ల మెల్లగా అభివృద్ధి చెంది నిజాం పాలకుల హయాం నాటికి తాలూక హోదాను పొందింది. అనంతరం హైదరాబాద్-నాందేడ్ రైల్వే మార్గం ఏర్పాటులో భాగంగా స్థానికంగా రైల్వే స్టేషన్ ఏర్పడటంతో అంచలంచెలుగా నేడు హైదరాబాద్ నగరానికి ఉత్తర ముఖద్వారంగా మేడ్చల్ నిలిచింది.


మేడ్చల్ పెద్ద చెరువు

రైళ్లలో గంజాయి, గోవా మద్యం పట్టివేత

- తాండూరులో 12 కిలోల గంజాయి, వికారాబాద్‌లో 95 బాటిళ్ల గోవా మద్యం పట్టివేత
- వివరాలు వెల్లడించిన వికారాబాద్ ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రైళ్లలో అక్రమంగా రవాణా చేస్తున్న గోవా మద్యాన్ని, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వికారాబాద్ ఎక్సైజ్ ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తాండూరు ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్ హసన్, ఎక్సైజ్ ఈఎస్ విజయ భాస్కర్, టాస్క్‌ఫోర్స్ ఆర్‌పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. శనివారం భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న కోనార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఒరిస్సాకు చెందిన శిలావతి ఆరు గంజాయి ప్యాకెట్లు కలిగి ఒక్కొక్క ప్యాకెట్లులో 2కిలోల చొప్పున 12కిలోల గంజాయిని గుర్తుతెలియని వ్యక్తి తాండూరు రైల్వేస్టేషన్ నుంచి బయటికి తెచ్చి పెట్టగా అట్టి గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా శుక్రవారం గోవా నుంచి జార్ఖండ్ వెళ్తున్న వాస్కోడిగామ రైల్లో 83లీటర్ల గోవా మద్యం 95రకాల బాటిళ్లు గుర్తుతెలియని వ్యక్తి రవాణా చేస్తుండగా బాటిళ్లను సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను ఎవరన్నది ఇంకా గుర్తించలేదని ప్రయాణికులు సమాచారం ఇస్తే వారిని అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు పెద్దఎత్తున గంజాయి తరలుతోందని, గత వారం కిందట వికారాబాద్‌లో 28కిలోల గంజాయిని పట్టుకున్నామని తెలిపారు. అక్రమంగా గంజాయి, మద్యం తరలిపోకుండా నిఘా ముమ్మరం చేశామని తెలిపారు. ఈ సమావేశంలో తాండూరు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, వికారాబాద్ ఎస్‌హెచ్‌వో వీరాంజనేయులు, ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ తదితరులు ఉన్నారు.


తాండూరులో స్వాధీనం చేసుకున్న 12 కిలోల గంజాయి ప్యాకెట్లతో ఎక్సైజ్ పోలీసులు


చిన్నారితో మాట్లాడుతున్న పరిగి న్యాయాధికారిణి నాగుల శిల్ప

బాలసదనం సందర్శన

పరిగి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినీలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని పరిగి మున్సిఫ్‌కోర్టు న్యాయాధికారిణి నాగుల శిల్ప అన్నారు. పరిగిలోని బాలసదనాన్ని శనివారం ఆమె సందర్శించారు. బాలసదనంలో వంట గది, విద్యార్థులు నిద్రించే గదులను పరిశీలించారు. బాలికలతో మాట్లాడి బోధన తీరు వసతులు, సమస్యలను ఆరాతీశారు. ఈ సందర్భంగా న్యాయాధికారిణి మాట్లాడుతూ.. బాలికలకు మంచి ఆహారం, బోధన అందించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాది గౌస్‌పాషా, కోర్టు సిబ్బంది మోహన్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో లబ్ధి పొందాలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందే స్తోమతలేని పేదలు సీఎం సహాయనిధితో లబ్ధిపొందాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులోని పలువురు లబ్ధిదారులకు బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ టీఆర్‌ఎస్ నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

తాండూరులో చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు

తాండూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండూరు చెస్ ఛాంపియన్ షిప్ -2020-24 అండర్-14, అండర్-16 పోటీలను శనివారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 800మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 16 చెస్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా ముతసీమ్ (సెయింట్ మార్క్స్ హైస్కూల్), రన్నర్‌గా సాయి చరణ్ బాబు (విశ్వవేద పాఠశాల) ఎంపికయ్యారు. అండర్-14లో విన్నర్‌గా షేక్ ఇబ్రహీం (నాగార్జున పాఠశాల), రన్నర్‌గా భవానీ శంకర్ (నేతాజీ గురుదేవ్ పాఠశాల) విద్యార్థులు ఎంపికయ్యారు. విజేతలుగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్బీఎల్ ఎండీ సరళ శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు రవీందర్ రెడ్డి హాజరు కాగా హిందూ ధార్మిక పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్ అధ్యక్షతన వహించారు.


చెస్ విజేతలకు షీల్డ్ అందజేస్తున్న ఆర్బీఎల్ ఎండి. సరళ శ్రీనివాస్‌రెడ్డి


ఆడుతున్న విద్యార్థులు

శనీశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని మదనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల ఏకశిలా విగ్రహం, శ్రీ శనీశ్వరస్వామి ఆలయాన్ని శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ప్రకాశ్‌గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, గణేశ్ గుప్తా, నార్సింగ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్‌లు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారి, జగన్‌గౌడ్, రమేశ్‌యాదవ్, భిక్షపతి, నరేందర్‌గౌడ్, రామ్‌నాథ్, నీళ్ల శ్రీధర్‌గౌడ్, రమేశ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


శనీశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


దీక్షలో జేఏసీ నాయకులు

మండల కేంద్రం ఏర్పాటుకు పోరాటం ఉధృతం

తలకొండపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడికి నిరసనగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం సాగిస్తామని జేఏసీ నాయకులు ఉద్ఘాటించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 58వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ సంఘాల నేతలు కూర్చున్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలు చొరవ తీసుకోవాలన్నారు. జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు శరత్‌చంద్ర, అంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్, నాయకులు రాజశేఖర్, కృష్ణయ్య, చెన్నయ్య, నిరంజన్, అంజయ్య, లక్ష్మణ్ నాయక్, రాజునాయక్, అల్లావుద్దీన్, శరత్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ సేవలు చిరస్మరణీయం

మేడ్చల్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మాజీ సీఎల్‌పీ నేత, పి.జనార్దన్‌రెడ్డి(పీజేఆర్) అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు పీజేఆర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద పీజేఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ కొడె మహేస్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు పాటుపడాలి


సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తలకొండపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుకు తోడు దాతలు చేయూతనందించేందుకు ముందుకు రావాలని పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ కండె ఓంకారం, మార్కెట్ డైరెక్టర్ అజీమ్‌లు పిలుపు నిచ్చారు. తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ సందడి నరేందర్ రెడ్డి రూ.25 వేలతో పది సీలింగ్ ఫ్యాన్లు సమకూర్చారు. శనివారం లయన్స్‌క్లబ్ సభ్యులతో కలిసి వారు ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, క్రాంతికుమార్, ఝాన్సీలక్ష్మి, రాజేశ్వర్‌రెడ్డి, కబీర్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

100మీటర్ల పరుగులో రాష్ట్రస్థాయికి ఎంపిక



సాయి సుధిష్ణను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

తాండూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తాండూరులోని భాష్యం కళాశాలలో ఎంఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న సాయి సుధిష్ణ ఇటీవల జరిగిన సీఎం కప్ పోటీల్లో 100 మీటర్ల పరుగులో జిల్లాస్థాయి బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా సాయి సుధిష్ణను, ఆమె తల్లిదండ్రులను శనివారం కళాశాల యజమాన్యం సన్మానించింది. సాయి సుధిష్ణ క్రికెట్‌లో కూడ రంగారెడ్డి జట్టుకు ప్రాతినిత్యం వహిస్తూ 68వ ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఆడనుంది. తాండూరు నుంచి బూస్ట్ స్కాలర్‌షిప్ సాధించి క్రికెట్ దిగ్గజం రవిశాస్త్రి అకాడమిలో క్రికెట్ కోచింగ్ తీసుకుంటోంది. ఫాస్ట్‌బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. సాయి సుధిష్ణను శనివారం కళాశాల కరస్పాండెంట్ పర్యాద రామకృష్ణ, అధ్యక్షురాలు అనురాధ రమేష్, ప్రిన్సిపల్ సోమనాథ్, అధ్యాపకులు సన్మానించారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు



పైకప్పు నుంచి ఊడిన పెచ్చులను చూయిస్తున్న హెచ్ఎం కీర్తి

కొడంగల్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని హస్నాబాద్ ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందారు. తరగతి గదుల్లో శనివారం ఒక్కసారిగా పైకప్పు పెచ్చులూడి పడటంతో విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. పాఠశాల శిథిలావస్థకు చేరిందని, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని హెచ్ఎం కీర్తి వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు టి.భీములు తదితరులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాలి

వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



ధారూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీచేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

ధారూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధారూరు పోలీసు సర్కిల్‌పరిధిలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ధారూరు సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేసిన అనంతరం పోలీసు అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడకుండా వారిపై దృష్టి సారించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో ఉంచుకుని సిబ్బంది గ్రామాల్లో ప్రత్యేక దృష్టిపెట్టాలని, అలజడులు సృష్టించి శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీకెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన సీఐ కార్యాలయం, పోలీసుస్టేషన్‌లలో పలు రికార్డులను తనిఖీచేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రఘురాం, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ ఉన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు వంశీ నివాళి



పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, దివంగత మన్మోహన్ సింగ్ మృతి పట్ల సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో మన్మోహన్‌సింగ్ పార్థివదేహాన్ని శనివారం సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. దేశానికి మన్మోహన్ సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని వంశీ అన్నారు. మన్మోహన్ మృతితో దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయిందన్నారు. ఆయన సేవలను దేశం ఎప్పుడూ గుర్తించుకుంటుందని కొనియాడారు.

నెర్రెలు బారిన రోడ్డు



కేశంపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సంగెం- నుంచి వేముల్‌నర్వ ప్రధాన రోడ్డును ఇటీవల విస్తరించారు. సంగెం నుంచి వేముల్‌నర్వ వరకు రోడ్డును బాగానే వేశారు. అయితే, సంగెం గ్రామ సమీపంలో రోడ్డు వేసే సమయంలో సరైన ప్రమాణాలు పాటించారో.. లేదో! కానీ, దాదాపు 100 మీటర్ల వరకు రోడ్డు నెర్రెలు బారింది. దాంతో రోడ్డు కుంగిపోయింది. వాహనదారులు గమనించకుండా వెళుతుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

యాసంగి వరి నాట్లు ముమ్మరం



చిన్నతూండ్లలో వరి నాట్లు వేస్తున్న రైతులు

యాచారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలో యాసంగి వరినాట్లు జోరందుకున్నాయి. యాచారం, చిన్నతూండ్ల, నందివనపర్తి, కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి, చింతపట్ల తదితర గ్రామాలలో ఇప్పటివరకు 135 ఎకరాలలో నాట్లు వేశారు. నీటి కొరత ఏర్పడకుండా, వడగండ్ల బారిన పడకుండా రైతులు ముందస్తుగా నాట్లు వేయిస్తున్నారు. నీటి కొరత ఏర్పడకుండా కొందరు రైతులు బోర్లను డ్రిల్ చేయిస్తున్నారు. యాచారం సొసైటీ అధికారులు ఎరువులను సిద్ధంగా ఉంచారు. ఆధార్, పాస్‌బుక్ లేకుండా ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వొద్దని వ్యవసాయ అధికారులు వ్యాపారులకు సూచనలు చేశారు. మండలంలో 3680 ఎకరాలలో వరి సాగు అయ్యే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు.

కొండను పిండేస్తున్నారు!

- గిరిగేట్‌పల్లి ప్రాంతాల్లో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు
- యథేచ్ఛగా అక్రమార్కుల ఆగడాలు
- గిరిగేట్‌పల్లిలో కనుమరుగైన పెద్దగుట్ట
- చుట్టుపక్క గ్రామాల్లోనూ ఇదే తంతు
- వ్యాపారం మొత్తం చీకటి దందానే
- తవ్వకాలు జరిపే ప్రాంతాలకు ఎవరూ రాకుండా గస్తీ



ధన్నారం సమీపంలో పోలీసులు పట్టుకున్న లారీలు, టిప్పర్

వికారాబాద్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టికి బయట మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దాన్ని వ్యాపారంగా మార్చుకున్న అక్రమార్కులు చీకటి పడితే చాలు ఎర్రమట్టి కొండలను తవ్వేస్తున్నారు. అర్ధరాత్రి మొదలు తెల్లవారుజాము వరకు గుట్టలను తోడేస్తూ లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని చుట్టూరా ఈ వ్యాపారం మూడు పూలు.. ఆరు కాయాలుగా కొనసాగుతోంది. వీరికి కొందరు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలున్నాయన్న చర్చ స్థానికంగా సాగుతోంది. అందువల్లే వారిని అడిగే వారు లేరన్న ధీమాతో అక్రమారుకలు ధనార్జనే ధ్యేయంగా మట్టిని తరలిస్తున్నారు. గిరిగేట్‌పల్లి, మద్గుల్ చిట్టంపల్లి, సిద్దులూరు, ధన్నారం, కోటాలగూడ, బురాంతపల్లితో పాటు చుట్టు పక్కల చాలా గ్రామాల్లో ఎర్రమట్టి దందాను అక్రమార్కులు కొనసాగిస్తున్నారు.

అసైన్డ్ భూముల్లో అక్రమ వ్యాపారం

గిరిగేట్‌పల్లి గ్రామంలో అసైన్డ్ భూముల్లో వ్యాపారులు అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ఉన్న కొండను పూర్తిగా తొలగించి రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ వ్యాపారం కొనసాగుతుండగా ప్రస్తుతం ఆ ప్రాంతం మొత్తం ఎర్రమట్టి లోయలను తలపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే అసైన్డ్ భూమిలో రైతుకు రూ.200 చొప్పున టిప్పర్‌కు చెల్లించి వ్యాపారులు బయటి మార్కెట్‌లో వేల రూపాయలకు విక్రయిస్తున్నారు.

రాత్రి దందా..

గిరిగేట్‌పల్లిలో ఇద్దరు రైతులకు చెందిన 5.20ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంతకాలంగా అక్రమంగా మట్టిని తోడేస్తున్నారు. రాత్రి 12 గంటలకు మొదలు తెల్లవారుజామున నాలుగు గంటల వరకు ఈ వ్యాపారం జరుగుతోంది. దీనికి ఒక ప్రణాళిక వేసుకుని పోలీసులు మీడియా, ఇతర అధికారులు గ్రామంలోకి వచ్చే మార్గాల్లో గస్తీ నిర్వహించి ఎవరూ రాకుండా వ్యాపారం చేస్తున్నారు. కింది స్థాయి అధికారులు ఎవరైనా వచ్చిన వారికి నయానో భయానో చేతులు తడిపి పంపిస్తుండడంతో వారి వ్యాపారం కొద్ది రోజుల్లోనే లక్షలు దాటింది.

గిరిగేట్‌పల్లి అంటేనే ఎర్రమట్టి వ్యాపారం

వికారాబాద్ మునిసిపాలిటీలో ఉన్న గిరిగేట్‌పల్లి గ్రామం అంటేనే ఎర్రమట్టి దందాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అయినా, అధికారుల్లో చలనం రావడం లేదు. కొంత కాలంగా అక్కడ ఎర్రమట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. గతంలో అక్కడ ఏర్పాటు చేసిన ఓ ఫంక్షన్ హాల్‌కు సైతం గ్రామస్తులు అంతా కలిసి ఎర్రమట్టిని తవ్వి అమ్ముకున్నారు. అలా ఒక్కొక్కరు ఎర్రమట్టిని గ్రామం చుట్టూ ఉన్న కొండను తవ్వి పట్టణంలోని వెంచర్లకు, చుట్టుపక్కల గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకోవడం చేస్తూ వస్తున్నారు.

ఎర్రమట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

ధన్నారం శివారులో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న వారిపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. ఏడుగురు వ్యక్తులను పట్టుకుని రెండు లారీలు, ఒక టిప్పర్‌ను ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజనేయులు తెలిపారు.

మట్టి టిప్పర్లు, జేసీబీని పట్టుకున్నాం

అర్ధరాత్రి మట్టి కొడుతున్నారని సమాచారం రావడంతో గిరిగేట్‌పల్లి గ్రామానికి వెళ్లి ఎర్రమట్టి కొడుతున్న టిప్పర్ లారీలను, జేసీబీని పట్టుకున్నాం. వికారాబాద్ చుట్టుపక్కల గ్రామాల్లో సైతం ఎర్రమట్టి కొడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అలాంటి వారిని ఉపేక్షించేది లేదు. మూడురోజుల క్రితం కూడా మండలంలో ఎర్రమట్టి కొడుతున్న వాహనాలను పట్టుకున్నాం. అనుమతులు లేకుండా ఎర్రమట్టి కొడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

- వికారాబాద్ సీఐ భీంకుమార్

ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అధికారుల సర్వే



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల పరిధిలోని లగచర్లలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అధికారులు శనివారం సర్వే నిర్వహించారు. హకీంపేట్ పరిధిలోని 252 సర్వే నెంబరులో లావని పట్టాల సర్వే నిర్వహించినట్లు దుద్యాల, కొడంగల్ తహసీల్దార్‌లు కిషన్, విజయ్‌కుమార్ తెలిపారు. రైతులతో సమావేశం నిర్వహించి సోమవారం నుంచి ఫీల్డ్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 252 సర్వే నెంబరులో పట్టాదారులు తమ హద్దులు చూయించాలని రైతులతో కోరారు.

స్వల్పంగా పెరిగిన కందుల ధరలు

ధారూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన వ్యవసాయ ఉత్పత్తుల బీట్లలో కందుల ధరలు స్వల్పంగా పెరిగాయి. గతవారం కందులు ధరలు పడిపోగా ఈవారం కొంతమేర కందులు ధరలు పెరిగాయి. కందులు క్వింటాలుకు రూ.8,050ల నుంచి, రూ.8,210వరకు ధర పలికాయి. కాగా గతవారం క్వింటాలుకు రూ.7,300ల నుంచి రూ.7,775వరకు ధరలు పలికాయి. క్వింటాలుకు రూ.435లు ధర పెరిగింది. ధాన్యం క్వింటాలుకు రూ.2,200ల నుంచి రూ.2,280ల వరకు సోనామసూరి రకం క్వింటాలుకు రూ.2,440ల నుంచి రూ.2,630ల వరకు ధరలు పలికాయి. మార్కెట్‌లో ధాన్యం 555క్వింటాళ్లు, కందులు 190క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే 'ఫార్మాసిటీ' రైతులకు ఇంటిస్థలాలు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



మీర్కాన్‌పేటలో హెచ్ఎండీఏ వెంచర్‌లో రైతులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

కందుకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫార్మసిటీ ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు భూములు ఇచ్చారని.. ముందు చూపుతోనే వారికి ఎకరం భూమికి గుంట చొప్పున ఇంటి స్థలాలను అన్ని అంగులతో అభివృద్ధి చేసి ఇచ్చినట్లు మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. అనంతరం మీర్కాన్‌పేట రెవెన్యూ పరిధిలోని 600 ఎకరాలలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న వెంచర్ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఆదేశానుసారం కందుకూరు, యాచారం మండలాలలో సుమారు 14వేల ఎకరాల భూమిని ఫార్మసిటీ కోసం సేకరించినట్లు చెప్పారు. రైతులకు పరిహారం మంజూరు చేసి భూసేకరన పూర్తిచేసినట్లు గుర్తు చేశారు. అయితే, రైతులు విలువైన భూములు ఇచ్చారని.. వారికి ఎలాంటి నష్టం కలగకుండా ఎకరం భూమి కింద గుంట(121గజాల) ఇంటి స్థలాన్ని కేటాయించడానికి మీర్కాన్‌పేట, పంజగూడ, తిమ్మాయపల్లి రెవెన్యూలో 600 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే రైతులకు ఇంటి స్థలానికి సంబంధించిన పత్రాలను అందజేసినట్లు చెప్పారు. రైతులు ఐదేళ్ల తరువాత స్థలాలను అమ్ముకునే హక్కులు కల్పించాలని అనుకున్నట్లు సబితాఇంద్రారెడ్డి తెలిపారు. కానీ, కొందరు రియల్ వ్యాపారులు అమాయక రైతులను ఆసరా చేసుకొని తక్కువ ధరలకే కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఐదేళ్లలో ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, రైతులు ప్లాట్లను అమ్ముకోవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు కందుకూరు మండలంలోని ముచ్చర్ల, మీర్కాన్‌పేట, పంజగూడ, సార్లరావులపల్లి, తిమ్మాయపల్లి, గ్రామాలకు చెందిన రైతులకు 1,560 మందికి ఇంటి స్థలాలకు సంబంధించిన పత్రాలను అందజేసినట్లు గుర్తు చేశారు. ఆయా పత్రాల ఆధారంగా ప్లాట్‌నెంబర్లు వేయాలని ఆర్డీవోను కోరినట్లు సబితారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కాకి ఇందిర, రజిత, బి.నరేందర్‌గౌడ్, డిల్లీ గణేష్, మాజీ ఎంపీటీసీ కాకి రాములు, డైరక్టర్ పొట్టి ఆనంద్, నాయకులు యన్నె జయేందర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ, ఎలుక మేఘనాథ్‌రెడ్డి, టి.దేవేందర్, ప్రవీణ్‌నాయక్, జంగయ్య, తిరుపతయ్య, బొక్క దీక్షిత్‌రెడ్డి, భీమ్‌నాయక్, మహిపాల్, కృష్ణ, ఎగ్గిడి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గోపాల్‌రెడ్డి తదితరులు

నూతన మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలి

కలెక్టర్‌కు చిలుకూరు గ్రామస్థుల వినతి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏడు గ్రామాలను కలిపి నూతనంగా ఏర్పాటు చేస్తున్న మొయినాబాద్ మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు చిలుకూరు గ్రామస్థులతో కలిసి శనివారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గోపాల్‌రెడి మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న మొయినాబాద్ మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరుపెట్టాలని, మున్సిపాలిటీలో విలీనం అవుతున్న ఏడు గ్రామాల్లో చిలుకూరు గ్రామం పెద్దదని, జనాభా, రెవెన్యూ పరంగానూ మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు చిలుకూరు గ్రామ పరిధిలో ఉన్నాయన్నారు. బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం కూడా గ్రామ పరిధిలో ఉందని వివరించారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని నూతన మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ సహదేవ్‌గౌడ్, శ్రీరాములు ముదిరాజ్, మహేష్ చారి, మాల్లారెడ్డిలు ఉన్నారు. కాగా, ఈ విషయమై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కూడా వారు కలిశారు.

రాష్ట్రంలో అత్యుత్తమ క్రీడా పాలసీ

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



అర్జున్ మురళిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా ఫోర్త్‌సిటీలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్‌లోని లూధియానాలో నిర్వహించిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్ అండర్-14 పోటీల్లో ఆమనగల్లు మున్సిపాలిటీ నగారాగడ్డ తండాకు చెందిన అర్జున్ మురళి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రజక పతకం సాధించాడు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం అర్జున్ మురళిని సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. జాతీయ స్థాయిలో విజయం సాధించడం తెలంగాణకు గర్వకారణమని కసిరెడ్డి అన్నారు. క్రీడాకారుని తండ్రి మురళి మోహన్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మానయ్య, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రమేశ్‌గౌడ్, తదితరులున్నారు. అలాగే ఆమనగల్లు పట్టణంలో దివంగత కేంద్ర మాజీమంత్రి సూదిని జైపాల్ రెడ్డి, మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి, మాజీ ప్రధాని మన్మోన్ సింగ్‌ల విగ్రహాల ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందజేయగా అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఏడేళ్లయినా పూర్తికాలే!



అర్థంతరంగా నిలిచిన ఐసీడీఎస్ అదనపు భవన నిర్మాణం

చేవెళ్ల. డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా చేవెళ్ల మండల కేంద్రంలో చేపట్టిన ఐసీడీఎస్ అదనపు భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమావేశాలు నిర్వహించుకునేందుకు గత ప్రభుత్వం అదనపు భవనం మంజూరు చేసింది. దీని నిర్మాణానికి జెడ్పీ నిధుల నుంచి రూ.5లక్షలు కేటాయించింది. మొదట్లో పనులు వేగవంతంగా జరిగినా.. ఆ తర్వాత నిధులు సరిపోలేదు. దీంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశాడు. ఏడేళ్లుగా భవన నిర్మాణం నిలిచిపోయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి మొండి గోడలతో దర్శనమిస్తున్న ఐసీడీఎస్ కార్యాలయ భవనాన్ని పూర్తిచేయాలని ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.

రెవెన్యూ సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు భూమి లభ్యత ప్రతిపాదనలు, పాత ధాన్యంసేకరణ, ధాన్యం నిలువ చేసిన భవనాలు, ఓఆర్సీ 38 ఈ, ధరణి పెండెన్సీ తదితర అంశాలపై శనివారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మండల తహసీల్దార్లు, రెవెన్యూ సంబంధిత సూపరింటెండెంట్‌లతో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ధరణిలో ఎలాంటి పెండింగ్‌లు ఉండకుండా ఫైల్స్ క్లియరెన్స్ చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అలాంటి వారిపై చర్యలు తప్పవని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి గుర్తించబడిన భూముల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు నిర్మాణాలకు సంబంధించిన భూములను గుర్తించడంతో పాటు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను సమర్పించాలని అధికారులకు సూచించారు. విద్యాసంస్థలకు పంపించే బియ్యం లభ్యత, నాణ్యతను, బియ్యం నిల్వ చేసే గోదాంలను, చౌకధర దుకాణాలను తనిఖీలు చేసి ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామ్ రెడ్డి, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు



కులకచర్ల మండలం అంతారంలో ఇటుకు బట్టీ దగ్గర యజమాని, కూలీలతో మాట్లాడుతున్న పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి

కులకచర్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిల్లలను పనుల్లో పెట్టుకుంటే ఇటుకబట్టి యజమానులపై కేసులు నమోదు చేస్తామని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలో కొనసాగుతున్న ఇటుక బట్టీలను శనివారం ఆయన తనిఖీ చేశారు. యజమానులు, కూలీలతో సీఐ మాట్లాడారు. బడీడు పిల్లలు ఉంటే వివరాలు తెలియజేయాలని వారి కోసం ప్రత్యేక బడుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే ఇటుక బట్టి యజమానులకు, కూలీలకు అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కూలీలు తమ పూర్తి వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అందించాలని సూచించారు. ఇటుక బట్టి నిర్వాహణకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తప్పకుండా పొందాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ అన్వేష్‌రెడ్డి ఉన్నారు.

చికెన్, మటన్ వ్యర్థాల సేకరణకు వేలం

● రూ.12.55లక్షలకు దక్కించుకున్న ఏజెన్సీ



వ్యర్థాల సేకరణకు వేలం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

తాండూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో ఎట్టకేలకు చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాల సేకరణకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో టెండర్ దక్కించుకునేందుకు నలుగురు పాల్గొనగా ఏపీకి చెందిన ఏఆర్‌ఫిష్ ప్రొడక్ట్ ఏజెన్సీ ప్రతినిధి అఫ్జల్ రూ.12లక్షల 55వేలకు టెండర్‌ను దక్కించుకున్నారు. మొదట మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న ఆధ్వర్యంలో కమిషనర్ చాంబర్‌లో వేలంను ప్రారంభించారు. టెండర్ దక్కించుకున్న వారు మూడు రోజుల్లో వేలం నిధులు బల్దియాలో జమచేయాలని లేదంటే వారికి సంబంధించిన ప్రాపర్టీని మార్టిగేట్ చేయాలని నిబంధనను సూచించారు. అయితే జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పాటు ఎలాంటి టెండర్ నిర్వహించకుండా వ్యర్థాల సేకరణ బాధ్యతను ఎవరికి అప్పగించారు? ఈబాధ్యత తీసుకున్న వారు బల్దియాకు ఎంత చెల్లించారని వివరాలు తెలియజేసేందుకు అటు కమిషనర్, ఇటు చైర్‌పర్సన్ ఆసక్తి చూపలేదు. బల్దియాలో నిబంధన మేరకే చికెన్, మటన్ వ్యర్థాల సేకరణ వేలం వేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రం సింహారెడ్డి చెప్పుకొచ్చారు.

శనీశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



శనీశ్వరస్వామిని దర్శించుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మోమిన్‌పేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్గశిర కృష్ణ త్రయోదశి సందర్భంగా మండలంలోని ఎన్కతలలో శనివారం శ్రీ శనీశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయంలో పురోహితులు స్వామివారికి తైలాభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య స్వామివారిని దర్శించుకొని వేద పండితులు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలోప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు కస్తూరిరాంరెడ్డి తన యులు కస్తూరి వెంకటిరెడ్డి, కస్తూరి గోపాల్‌రెడ్డి, కస్తూరి శ్రీనివాస్ రెడ్డిలు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ అరవింద్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

శనీశ్వరుడి దయతోనే వరుస విజయాలు: ఎమ్మెల్యే

శనీశ్వరస్వామి దయతోనే వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందుతు న్నానని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి కృపతో తాను ప్రతీ సారి గెలుపొందుతున్నానని, ప్రతీ అమావాస్యకు శని త్రయోదశిని పురస్కరించుకొని ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

కనకదుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవాబుపేట: మండలంలోని చించల్‌పేట్‌లో కనక దుర్గమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వెంకటిరెడ్డి, చిట్టెపు ప్రభాకర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లు సంస్కృతీ సంప్రదాయాలకు చిహ్నాలు

పరిగి,డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీసరస్వతీ శిశుమందిర్‌లు హిందూ సంస్కృతీ సంప్రదాయాలకు చిహ్నాలని ప్రముఖ సామాజిక విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి అన్నారు. పరిగిలోని శ్రీసరస్వతీ శిశుమందిరంలో అదనపు గదుల నిర్మాణాలకు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యతోపాటు సంస్కృతీ కూడా చాలా ముఖ్యమన్నారు. దేశ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఆరు గదుల నిర్మాణాలు పూర్తిచేయాలని సంకల్పం పెట్టుకున్నట్లు ప్రధానాచార్యులు మల్లేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.మల్లేశ్, వెంకటేశం, వెంకట్‌రాంలు, గోపాల్, బ్రహ్మయ్య, ఎం.నాగేశ్వర్, వీరేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.



అదనపు గదుల నిర్మాణాలకు భూమిచేస్తున్న నాయకులు

ఆలయాన్ని తొలగించొద్దు



ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

కీసర రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిమాన్వితమైన పురాతన ఆలయాన్ని తొలగించొద్దని నాగారం మున్సిపాలిటీ రాంపల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. నాగారం మున్సిపాలిటీ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చెర్లపల్లి నుంచి కరీంగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణలో భాగంగా నాగారం మున్సిపాలిటీ రాంపల్లి నుంచి చెరవల్లికి వెళ్లే దారిలో అడ్డాగు వద్ద శ్రీరామాంజనేయ ఆలయం ఉంది. రోడ్డు విస్తరణలో భాగంగా ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న స్థానికులు ఆలయ తొలగింపు పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయ తొలగింపు చర్యను విరమించుకోవాలని అధికారులను కోరారు. ఆలయాన్ని తొలగించకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేసారు. భక్తుల భక్తి విశ్వాసాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

కులకచర్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధంపై జీవ మిత్ర ఆర్గనైజేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని పుట్టపహాడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత అన్నారు. పుట్టపహాడ్‌లో ప్లాస్టిక్ నిషేధంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించిందని, వాడకూడదని పంచాయతీ కార్యదర్శి కవిత తెలిపారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని ఆర్గానిక్ కవర్లు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవ మిత్ర ఆర్గనైజేషన్ నిర్వాహకులు సాయిభరత్ కుమార్, ఉత్తమ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అనుమతులు చూపించండి

● ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల చర్యలు

● రిసార్ట్స్ నిర్వాహకులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వికారాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా రిసార్ట్స్ నడిపిస్తే చర్యలు తప్పవని వెంటనే అనుమతులు చూపించాలని పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. గతంలో అనుమతులు లేవని సీజ్ చేసినా మళ్లీ తెరిచి నడిపించడమేంటని, నోటీసులు చూపించండి అని నోటీసులు అందజేశారు. ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో 'సర్పన్‌పల్లి చెరువు.. అక్రమాలకు అడ్డా!' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు పంచాయతీ కార్యదర్శి స్వాతి ద్వారా అక్రమంగా కొనసాగుతున్న గోధుమగూడ పరిధిలోని ఐదు రిసార్ట్స్‌లకు నోటీసులు జారీ చేశారు. గోధుమగూడ పరిధిలోని టిక్కీవిల్లా, వైల్డర్‌నెస్, అవని, వింటేజ్ విలేజ్‌తో పాటు మరో రిసార్ట్స్‌లో అనుమతులు లేకుండా బుకింగ్‌లు చేసినా, న్యూయర్ వేడుకలు నిర్వహించినా చర్యలు తప్పవని అధికారి సూచించారు. అనుమతి పత్రాలను గ్రామా పంచాయతీలో చూపించిన తర్వాతే వేడుకలు చేసుకోవాలన్నారు.



సర్పన్‌పల్లి చెరువు..

అక్రమాలకు అడ్డా!

ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

జిల్లా అధికారులు సీరియస్

రిసార్ట్స్ అనుమతి లేకుండా న్యూయర్ వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. రిసార్ట్స్, ఫాంహౌస్‌లలో న్యూయర్ వేడుకలు నిర్వహించాలని పోలీస్ శాఖ తరుపున అనుమతులు తీసుకోవాలని అందుకు సంబంధించి అనుమతి పత్రాలు పోలీస్ శాఖకు అందించాలని సూచించారు.



టిక్కీవిలేజ్ రిసార్ట్స్ నిర్వాహకులకు నోటీసులు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి స్వాతి

క్రైం రన్!

(5వ పేజీ తరువాయి)

పూనేలో అరెస్టు చేశారు.

సవాల్‌గా మారిన చైన్ స్నాచర్ అరెస్టు..

మూడు రాష్ట్రాల పోలీసులకు సవాల్‌గా మారిన చైన్ స్నాచర్‌ను జిల్లా సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. కులకచర్ల, వికారాబాద్, బొంరాస్‌పేట పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలకు హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్టకు చెందిన జావీద్ కారణమని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంతయ్య గుర్తించారు. నిందితుడు తన ఆచూకీని ఎవరు గుర్తించకుండా ఉండేందుకు ఎక్కడ కూడా సెల్‌ఫోన్ వాడకుండా జాగ్రత్త పడేవాడు. జావీద్ కదలికలపై నిఘా వేసిన సీసీఎస్ బృందం బీదర్ జిల్లాలోని హుమ్నాబాద్‌లో అతడిని అరెస్టు చేసింది. జావీద్‌పై తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 159 చైన్ స్నాచింగ్ కేసులు ఉన్నాయి.

మణప్పురం కేసు ఛేధించిన సీసీఎస్ పోలీసులు...

పోలీసులకు సవాల్‌గా మారిన మణప్పురం కేసును సీసీఎస్ పోలీసులు ఛేదించారు. వికారాబాద్ పట్టణంలోని మణప్పురం గోల్డ్ లోన్ బ్యాంకులో మేనేజర్‌గా పని చే సిన విశాల్ రూ.1.24 కోట్లు కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నించారు. వినియోగదారులు బ్యాంకులో తనఖా పెట్టుకున్న బంగారు ఆభరణాలపై పలుమార్లు రుణం తీసుకుంటూ సొమ్ము చేసుకుని పరారయ్యాడు. దీంతో ఆ బ్యాంకులో బంగారు ఆభరాలు తనఖా పెట్టి రుణం తీసుకున్న వారు ఎంతో ఆందోళనకు గురయ్యారు. బీదర్ జిల్లా, ఔరాద్‌కు చెందిన విశాల్‌ను జిల్లా ఎస్పీ నేతృత్వంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంతయ్య బృందం బెల్గాంలో అరెస్టు చేశారు.



మణప్పురం మేనేజర్ విశాల్‌ను మీడియా సమావేశంలో ప్రవేశపెట్టి వివరాలు చెబుతున్న ఎస్పీ నారాయణరెడ్డి(ఫైల్)

అక్రమార్కులపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం

అక్రమ కార్యకలాపాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు బృందం జిల్లాలో పలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కల్లు తయారీలో వినియోగించే క్లోరల్ హైడ్రేడ్‌ను పెద్ద ఎత్తున బొంరాస్‌పేట్ మండలంలో స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో 20 క్వింటాళ్ల స్వాధీనం చేసుకున్న ఘటన జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మేడ్చల్ జిల్లాలో పెరిగిన రోడ్డు ప్రమాదాలు...

గత ఏడాదితో పోలిస్తే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగింది. జిల్లాలో నేరాల అదుపునకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నా జిల్లాలో ఉపాధి కోసం పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాల నుండి వలసలు పెరుగుతుండటంతో నేరాల సంఖ్య కూడా పెరుగుతోంది. అదేవిధంగా అదృశ్యం కేసులు కూడా ఈ ఏడాది పెద్దఎత్తున నమోదయ్యాయి. గంజాయి, గుట్కా కేసులు కూడా పెద్ద ఎత్తున నమోదౌతున్నాయి. ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన వారు పెద ఎత్తున గంజాయి, గుట్కాల రవాణాకు పాల్పడుతున్నారు. పలు మార్లు జిల్లాలోని ఔటర్ రింగు రోడ్డు వద్ద చేపట్టిన తనిఖీల్లో పోలీసులు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ ఏడాది కొల్లూరు చెరువులో నలుగురు చిన్నారులు ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు. గజ్వేల్‌కు చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి శామీర్‌పేట పెద్ద చెరువులో పడి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ రియల్ వ్యాపారికి చెందిన రూ. 2.5కోట్లు డ్రైవర్ స్నేహితుడు దొంగతనానికి పాల్పడగా పోలీసులు నాలుగు రోజుల్లో కేసును ఛేదించారు.



వికారాబాద్ పట్టణంలో ఢీకొన్న కారు, మద్యం ట్రాలీవ్యాన్(ఫైల్)

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

దోమ, డిసెంబరు 28: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు సూచించారు. మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు అందుబాటులో ఉంటూ వివరాలను అందించాలన్నారు.

పరిగి: ఇంటింటికి తిరిగి ఇందిరమ్మ ఇళ్ళ దరఖాస్తులను వెరిఫికేషన్ చేస్తున్నట్లు నాల్గవ వార్డు ఇన్‌చార్జి శ్రీనివాస్ అన్నారు. నాల్గవ వార్డు పరిధిలోని స్థానిక నాయకులతో కలిసి శనివారం దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు రామకృష్ణారెడ్డి, హరిశ్చందర్, బాలరాజ్, రజితారెడ్డి, పావని తదితరులు పాల్గొన్నారు.

యాలాల: మండలంలోని జుంటుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వే నిర్వహించినట్లు యాలాల ఎంపీడీవో యాదయ్య తెలిపారు. ఆయన జుంటుపల్లిలో శనివారం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సర్వేలో గతంలో ఇంటి యజమానికి ప్రభుత్వ ఇళ్లు ఏమైనా మంజూరయ్యాయా, సొంత స్థలం కలిగి ఉన్నారా, ప్రస్తుతం సొంత ఇల్లు ఉందా, లేదా? అనే విషయాలను సర్వేలో ఇంటి యజమానులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. ఈ సర్వే పూర్తి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు.



పరిగి: నాల్గవ వార్డులో ఇందిరమ్మ ఇళ్ళ వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

యువత క్రీడల్లో రాణించాలి

దోమ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు అన్నారు. నెహ్రూ యువకేంద్రం మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం దోమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా యూత్ ఆఫీసర్ ఐజయ్య సహకారంతో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, వెంకటయ్య, నజీర్, బుజ్జిబాబు, వెంకటయ్య, అధ్యాపకులు సురేశ్, సత్తయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బొంరాస్‌పేట్: సీఎం కప్ పోటీల్లో భాగంగా ఈనెల 23వ తేదీన వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పరుగు పందెంలో ప్రతిభ కనబర్చిన మెట్లకుంటకు చెందిన పదో తరగతి విద్యార్థి రమేశ్‌కుమార్, 100 మీటర్ల పరుగు పందెంలో పదోతరగతి విద్యార్థిని మస్రత్ బేగంను శనివారం ఎంఈవో హరిలాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దోమ: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో

పేద పిల్లలకు అండగా నిలవాలి

కీసర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పేద పిల్లలకు అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ కీసర మండల వర్కిగ్ ప్రెసిడెంట్ రామిడి స్వప్న విజయరెడ్డి తెలిపారు. పట్టణంలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న సుమకు కళాశాల ఫీజు అందజేశారు. రెండు సంవత్సరాలుగా తామే ఫీజు చెల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మదార్, అధ్యాపకులు, సుమ పాల్గొన్నారు.



విద్యార్థినికి కళాశాల ఫీజు అందజేస్తున్న స్వప్నవిజయరెడ్డి

ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడిగా నాగరాజు

వికారాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడిగా నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వికారాబాద్‌కు చెందిన మహేష్ సాగర్ నియామకమయ్యారు. సిద్దిపేటలో మూడు రోజులపాటు నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర 43వ మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నాగరాజు, మహేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామని తెలిపారు.



నాగరాజు

నూతన కార్యవర్గం

తాండూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తాండూరు అక్కమహాదేవి వీరశైవ మహిళా మండలి 2024-26 నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కన్వీనర్‌గా కొల్లి విజయలక్ష్మి, గౌరవ అధ్యక్షులుగా పటేల్ మల్లమ్మ, అధ్యక్షురాలిగా జొల్లు రోహిణి, ఉపాధ్యక్షురాలుగా కోకట్ నీతా, ధర్మిది చంద్రకళ, బాలి సావిత్ర, కందనెల్లి అక్షర, ప్రధాన కార్యదర్శిగా కొర్వార్ అంజలి, సహకార్యదర్శులుగా శ్రీదేవి, దోమ త్రివేణి, ఎల్మకన్నె మహేశ్వరి, సింధు, కోశాధికారిగా పూడూరు సులోచన, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా శాంత, అగ్గనూర్ సంగీతను ఎన్నుకున్నారు.



అక్కమహాదేవి వీరశైవ మహిళా మండలి నూతన కార్యవర్గం

నేడు విద్యుత్ అంతరాయం

కొడంగల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కార్గిల్ కాలనీలో 33 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అర్జున్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొడంగల్, పెద్దనందిగామ, రావులపల్లి, టేకుల్‌కోడ్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో రైలుకింద పడి పోస్టుమాస్టర్ మృతి

తాండూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి బ్రాంచ్ పోస్టుమాస్టర్ మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జినుగుర్తికి చెందిన జనుముల అంజిలయ్య(52) జినుగుర్తి బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన పోస్టల్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పెన్షన్ డబ్బులు శుక్రవారం రూ.14లక్షలను డ్రాచేసుకుని తన కుమారుడికి ఇచ్చి ఇంటికి పంపించాడు. అయితే రాత్రి 8గంటల సమయంలో తాండూరులోని శివాజీచౌక్ నుంచి నారాయణపూర్ రోడ్డు మార్గంలోని రైలు పట్టాలవద్ద తాండూరు-మంతట్టి రైలు వర్గంలోని పీర్‌పకీర్‌సాబ్ దర్గా సమీపంలో అంజిలయ్య రైలు కిందపడి మృతిచెందాడు. దీంతో శనివారం ఉదయం రైల్వే శాఖకు చెందిన కీమెన్ పట్టాల వద్ద మృతదేహాన్ని గుర్తించి తాండూరు రైల్వే సూపరింటెంటెండ్‌కు సమాచారం అందించాడు. దీంతో స్టేషన్‌మాస్టర్ ఫిర్యాదుమేరకు తాండూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వీరేశం ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో భార్య సుశీల ఆధార్‌కార్డు, పోస్టల్‌కు సంబంధించిన కొన్ని రిసిప్టులు లభించాయి. రైలుపట్టాల పక్కనే మృతుడి బైకు కూడా నిలిపిఉంది. అయితే వాటిని పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి శవపరీక్ష నిమిత్తం పంపించారు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. భార్య సుశీల మాత్రం తన భర్తను ఎవరో హత్య చేసి రైలు పట్టాలపై పడేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. తాండూరు పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ రాకేష్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. పింఛన్‌కు సంబంధించిన రూ.14లక్షల డబ్బులపై ఆరా తీసి ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నారు.. అదేవిధంగా సికింద్రాబాద్ జిల్లా పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులు డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.10వేలు అందజేశారు.



అంజిలయ్య(ఫైల్)

మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య

దోమ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గోడుగోనిపల్లికి చెందిన చెక్కలి మల్లేశ్(28) ఇంట్లో కుటుంబ తగాదాల నేపథ్యంలో మానసిక వేదనతో కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈవిషయాన్ని స్నేహితులు, బంధువులతో చెప్పుకోకుండా లోలోపల మనోవేదన చెందాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న రేకులరాడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్‌ఐ ఆనంద్ వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని సమాధానం ఇచ్చారు.



మల్లేశ్ (ఫైల్)

సరుకుల పంపిణీలో ఇబ్బందులు కలిగించొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో లబ్ధిదారులకు ఇబ్బందులు కలిగించొద్దని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతీ నెల 1 నుంచి 18 వరకు డీలర్‌లు దుకాణాల్లో లబ్ధిదారులకు అందుబాటులో ఉంటూ సరుకులను పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం నిరుపేదల ఆకలి తీర్చేందుకు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను అందిస్తుందని, డీలర్‌లు సమయ పాలన పాటించాలన్నారు. సమావేశంలో డీలర్‌లు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు

దోమ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ గందె రాములు, గుడిసె రాము అన్నారు. మండలంలోని బొంపల్లిలో శనివారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, బాల్‌రాజ్, గుడిసె రాము, కుర్వ రమేశ్, ఇంతియాజ్, హైమద్, ముబేర్, మహేశ్, కృష్ణ, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. శనివారం కులకచర్ల చౌరస్తాలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, పాంబండ ఆలయ కమిటీ చైర్మన్ షైపాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం



ఫుడ్‌ఫెస్టివల్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే తమ లక్ష్యమని కొర్రెముల శ్రీచైతన్య పాఠశాల డైరెక్టర్ సాంబోజు రమేష్‌బాబు తెలిపారు. కొర్రెములలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఇంటి నుంచి రుచికరమైన పలురకాల వంటకాలను తీసుకొచ్చి సామూహిక భోజనాలు చేశారు. పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బ్రహ్మాచారి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనవరల్ గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతి ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్ష 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు పరిగి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి ఒకటవ తేదిలోపు ఆన్‌లైన్‌లో రూ.100లు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్షలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులకు ఆయా వెబ్‌సైట్‌లలో దరఖాస్తులు చేసుకోవాలని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారురు.